క్లుప్తంగా

నేడు వల్లూరులో గడప గడపకు మన ప్రభుత్వం

వల్లూరు: మండల కేంద్రమైన వల్లూరు సచివాలయ పరిధిలో మంగళవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ అబ్బిరెడ్డిగారి వీరారెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. వల్లూరు సచివాలయ పరిధిలోని లింగాయపల్లె, సి.కొత్తపల్లె గ్రామాలల్లో నిర్వహిస్తున్న గడప గడపకు కార్యక్రమానికి ఎమ్మెల్యే రవీంద్రనాథ్ రెడ్డి హాజరు కానున్నారని, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొని విజయవంతం చేయాలని ఆయన అందులో పేర్కొన్నారు.

మెస్ చార్జీలు పెంచాలి

పులివెందుల రూరల్ : వైఎస్సార్ సంపూర్ణ పోషణ మెస్ ఛార్జీలు పెంచాలని.. అంగన్‌వాడీ హెల్పర్స్ న్యాయపరమైన డిమాండ్‌లు తీర్చాలని సీఐటీయూ ప్రధాన కార్యదర్శి సలీమా, సీఐటీయూ నాయకురాలు పద్మ, లక్ష్మీదేవి, రిషికా, సుజాత, కిరణ్మయి, సుధ, పుష్పమణి, లావణ్య, చంద్ర, కళావతి పేర్కొన్నారు. సోమవారం స్థానిక రెవెన్యూ కార్యాలయంలో ఉన్న డిప్యూటీ తహసీల్దార్ జగదీష్‌కు సీఐయూటీ నాయకురాలు వినతి పత్రం అందించారు. కార్యక్రమంలో సీఐటీయూ ప్రతినిధులు పాల్గొన్నారు.

మాతా, శిశు మరణాలను అరికడదాం

తొండూరు : రక్తహీనత జయించి మాత, శిశు మరణాలను అరికడదామని పీహెచ్‌సీ డాక్టర్ అరిఫుల్లా పేర్కొన్నారు. సోమవారం మండల కేంద్రమైన తొండూరు పీహెచ్‌సీలో ప్రధాన మంత్రి సురక్షిత మాతృత్వ అభియాన్ కార్యక్రమంలో భాగంగా గర్భవతులకు ప్రత్యేక వైద్య పరీక్షలు నిర్వహించారు. అనంతరం డాక్టర్ రేష్మా, కమ్యూనిటీ ఆరోగ్య అధికారిణి రమణమ్మలు గర్భవతులకు అరటి పండ్లు, చిక్కీలు పంపిణీ చేశారు. గర్భవతులు తప్పనిసరిగా పౌష్టికాహారం తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో హెల్త్ ఎడ్యుకేటర్ రమణమ్మ, హెల్త్ సూపర్‌వైజర్ శశికళ, సచివాలయ సిబ్బంది, ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

దాడి కేసులో ముగ్గురికి జైలు

జమ్మలమడుగు రూరల్: దాడి కేసులో ముగ్గురికి జైలు శిక్ష విధిస్తూ కోర్టు తీర్పు ఇచ్చింది. వివరాలు ఇలా ఉన్నాయి. జమ్మలమడుగు పట్టణానికి చెందిన షేక్. మహబూబ్‌బాషా, తండ్రి కమాల్‌సాహెబ్ అనే ఇరువురిపై కర్నూల్ జిల్లా ఆళ్లగడ్డకు చెందిన యు. మహమ్మద్ రఫీ, ఎస్. రహంతుల్లా, డి. దస్తగిరిలు 2016 డిశంబర్ 12వ తేదీన జమ్మలమడుగు వచ్చి వారిపై దాడి చేశారు.
అదే రోజు బాధితులు పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఆ మేరకు పోలీస్ అధికారులు ఆళ్లగడ్డకు చెందిన పై ముగ్గురిపై కేసు నమోదు చేశారు. కేసు పూర్వాపరాలు పరిశీలించిన మీదట సోమ వారం సివిల్ కోర్టు జడ్జి ఎస్. బాబాఫకృద్దీన్ తీర్పు చెప్పారు. యు. మహమ్మద్ రఫీ, ఎస్. రహంతుల్లా, డి. దస్తగిరిపై నేరం రుజువు కావడంతో వారికి 4 నెలలు జైలు శిక్ష, 6 వేల రూపాయలు జరిమానా విధించారని పట్టణ సిఐ. సదా శివయ్య తెలిపారు.

నేడు మండల సమావేశం

పెండ్లిమర్రి: మండల సర్వసభ్య సమావేశం మంగళవారం ఉదయం 10 గంటలకు ఎంపీపీ ఎం.వరలక్ష్మి అధ్యక్షతన నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో అల్తాఫ్ హుస్సేన్ ఒక ప్రకటనలో తెలిపారు. సర్వసభ్య సమావేశానికి ప్రజాప్రతినిధులు, మండల స్థాయి అధికారులు తప్పక హాజరుకావాలని ఆయన కోరారు.

వెన్నపూసను గెలిపించాలి

జమ్మలమడుగు: పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి వెన్నపూస రవీంద్రారెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని ఎమ్మెల్సీ ఎన్నికల ఇన్‌చార్జీ ఎస్వీ మధుసూదనరెడ్డి పేర్కొన్నారు. సోమవారం పట్టణంలోని పీఆర్ కాలేజీ, ఎన్జీఓ కార్యాలయంలో ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించిన ఓటింగ్ ఎలా వేయాలో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఓటర్లు రవీంద్రారెడ్డిని గెలిపించాలంటూ ప్రచారం నిర్వహించారు.

జూదరుల అరెస్టు

ముద్దనూరు: స్థానిక రైల్వే విద్యుత్ సబ్‌స్టేషన్ సమీపంలో పేకాట ఆడుతున్న నలుగురు జూదరులను సోమవారం పోలీసులు అరెస్టు చేశారు. అరెస్టయిన జూదరుల నుంచి రూ. 3050 నగదు స్వాధీనం చేసుకుని కేసు నమో దు చేసినట్లు ఏఎస్ఐ ఆంజనేయులు తెలిపారు.

వక్ఫ్‌బోర్డు ఆస్తులను పరిరక్షించాలి

జమ్మలమడుగు: ప్రభుత్వం వక్ఫ్‌బోర్డు ఆస్తులను రక్షించాలంటూ ఇన్సాఫ్ జిల్లా కార్యదర్శి ఎస్.ఎం.షరీఫ్ పేర్కొన్నారు. సోమవారం ఆర్డీఓ కార్యాలయంలో నిర్వహించిన స్పందన కార్యక్రమంలో భాగంగా ఆర్డీఓ జి.శ్రీనివాసులుకు వినతి పత్రం సమర్పించారు.
ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముస్లిం మైనార్టీల సంక్షేమం కోసం గతంలో నవాబులు వక్ఫ్‌బోర్డుకు భూములను ధారదత్తం చేశారు. ఆ ఆస్తులన్నీ అన్యాక్రాంతం అవుతున్నాయన్నారు. ప్రొద్దుటూరు మండలంలో మోడంపల్లి, కొత్తపల్లె, చాపాడు మండలంలోని అల్లాడుపల్లె దేవాలయాల గ్రామంలో వక్ఫ్‌బోర్డు భూములను అన్యాక్రాంతం చేసుకుని సాగు చేసుకుంటున్నారన్నారు. ఈ భూములను తిరిగి అధికారులు స్వాధీనం చేసుకుని వక్ఫ్‌బోర్డుకు అప్పగించాలంటూ వివరించారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ కన్వీనర్ ఖాజా హుస్సేన్ అల్తాఫ్ తదితరులు పాల్గొన్నారు.

పేదలందరికీ సంక్షేమ పథకాలు

– ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి



ఆత్మీయ సభకు హాజరైన సచివాలయ నూతన కన్వీనర్లు, వలంటీర్లు, వైఎస్సార్‌సీపీ నాయకులు (ఇన్‌సెట్) మాట్లాడుతున్న కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి

పులివెందుల : అర్హులైన ప్రతి పేదవాడికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందించడమే లక్ష్యంగా పనిచేయాలని కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి పిలుపునిచ్చారు. సోమవారం స్థానిక భాకరాపురంలోని వైఎస్సార్ ఆడిటోరియంలో వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సచివాలయ నూతన కన్వీనర్లు, వలంటీర్లు, నాయకులతో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. అంతకమునుపు ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి ... ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజా సంకల్ప యాత్ర పేరుతో చేసిన పాదయాత్ర నాలుగేళ్లు పూర్తయిన సందర్భంగా కేక్ కట్ చేసి పార్టీ నాయకులకు, అభిమానులకు తినిపించారు. అలాగే వైఎస్సార్ ఆడిటోరియంలో సమావేశానికి ముందు వైఎస్సార్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి మాట్లాడుతూ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీని ప్రజలకు మరింత చేరువ చేయాలనే ఉద్దేశ్యంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు ప్రతి సచివాలయానికి ముగ్గురు కన్వీనర్లు, అదేవిధంగా ప్రతి వలంటీర్ క్లస్టర్‌కు ఇద్దరు గృహ సారథులను నియమించాలని పార్టీ నిర్ణయించిందన్నారు. అందులో భాగంగా నియోజకవర్గ వ్యాప్తంగా 90సచివాలయాలకు సంబంధించి 270మంది కన్వీనర్లను నియమించడం జరిగిందన్నారు. ఒక రాజకీయ పార్టీ బలంగా ఉండాలంటే కార్యకర్తలు పునాదులు, పిల్లర్స్‌లాగా ఉంటేనే ఆ పార్టీ బలంగా ఉంటుందన్నారు. గ్రామ స్వరాజ్యానికి నిజమైన అర్థం చెబుతూ మన ముఖ్యమంత్రి సచివాలయ వ్యవస్థను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. సచివాలయ వ్యవస్థకు అనుగుణంగా వలంటీర్ వ్యవస్థను తీసుకరావడం జరిగిందన్నారు. వలంటీర్ల ద్వారా అర్హులైన ప్రతి ఒక్కరికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందుతున్నాయన్నారు. ఎవరికైనా ప్రభుత్వ పథకాలు అందలేని వారిని గుర్తించి అర్హులైన అందరికీ పథకాలు వర్తించేలా కృషి చేయాలన్నారు. పార్టీ నాయకులు, సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు సమిష్టిగా కృషి చేసి ప్రజలకు పథకాలు అందించాలన్నారు. కార్యక్రమంలో నియోజకవర్గంలోని ఎంపీపీలు, జెడ్పీటీసీలు, మండలాల కన్వీనర్లు, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

175 స్థానాలు కైవసం చేసుకుంటాం

– ఎమ్మెల్యే రవీంద్రనాథ్ రెడ్డి



వల్లూరులో నూతన పింఛన్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే పి.రవీంద్రనాథ్‌రెడ్డి

వల్లూరు: ఎన్నికలు ఎపుడు వచ్చినా 75శాతం ఓట్లతో 175 స్థానాలను వైఎస్సార్ సీపీ కైవసం చేసుకుంటుందని ఎమ్మెల్యే రవీంద్రనాథ్ రెడ్డి తెలిపారు. సోమవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయ సభా భవనంలో ఎంపీడీఓ జుబేదా అధ్యక్షతన నిర్వహించిన వైఎస్సార్ పెన్షన్ కానుక వారోత్సవాల్లో ఆయన నూతనంగా మంజూరైన 124 మందికి పింఛన్ల నగదు మొత్తం పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ అవ్వాతాతల మోములో చిరునవ్వు చూడడమే సీఎం వైఎస్ జగన్ లక్ష్యం అన్నారు. గత టీడీపీ ప్రభుత్వం 39 లక్షల మందికి పింఛన్లు పంపిణీ చేస్తే వైఎస్సార్ సీపీ ప్రస్తుతం 64 లక్షల మందికి పింఛన్లు పంపిణీ చేస్తోందన్నారు. చంద్రబాబు, కరువు కవల పిల్లలన్నారు. బాబు 15 ఏళ్ల పాలనలో ఒక్క మంచి పథకం అయినా పంపిణీ చేశారా అని ఆయన ప్రశ్నించారు. దేశంలో ఇంత మొత్తం ఏ రాష్ట్రంలో పింఛన్లకు పంపిణీ చేయడం లేదన్నారు. పార్టీలకతీతంగా, అర్హతే ప్రామాణికంగా పథకాలు అందించిన ఘనత జగన్‌మోహన్ రెడ్డికే దక్కుతుందన్నారు. ఎన్నికలు ఎపుడు జరిగినా ప్రజలంతా 100శాతం పోల్ చేయాలన్నారు. 75శాతం ఓట్లతో 175 సీట్లను వైఎస్సార్ సీపీ ప్రభుత్వం సాధించి తిరిగి అధికారంలోకి వస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల కన్వీనర్ అబ్బిరెడ్డిగారి వీరారెడ్డి, నేతలు ఇందిరెడ్డి శంకర్‌రెడ్డి, శివ కుమార్‌రెడ్డి, ప్రతాప్‌రెడ్డి, నాగిరెడ్డి, హరికేశవరెడ్డి, శ్రీనువాసుల రెడ్డి, వెంకట్రామిరెడ్డి, సుదర్శన్‌రెడ్డి, రామక్రిష్ణారెడ్డి, ఓబుల్‌రెడ్డి, పుల్లయ్య, అధికారులు పాల్గొన్నారు.

పెండ్లిమర్రి: పేదల సంక్షేమమే లక్ష్యంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారని ఎమ్మెల్యే పి.రవీంద్రనాథ్‌రెడ్డి పేర్కొన్నారు. పెండ్లిమర్రి ఎంపీడీవో కార్యాలయం సభా భవనంలో సోమవారం నూతన పింఛన్ల పంపిణీ కార్యక్రమం చేపట్టారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో నూతనంగా 202 పింఛన్లు మంజూరయ్యాయన్నారు. పార్టీలకు అతీతంగా అర్హులైన ప్రతి ఒక్కరికి వలంటీర్ వ్యవస్థ ద్వారా ఇంటి తలుపు తట్టి పింఛన్ అందజేస్తున్నారన్నారు. గత ప్రభుత్వంలో పింఛన్ల కోసం వృద్ధులు, వికలాంగులు, గంటల తరబడి పంచాయితీ కార్యాలయం వద్ద పడిగాపు కాసేవారని గుర్తు చేశారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు సీఎం జగన్ పింఛన్ సొమ్మును పెంచారన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ వైస్ ఛైర్మన్ బాలయ్య, మండల స్పెషలాఫీసర్ ప్రభాకర్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి శివశంకర్ రెడ్డి, ఆగ్రో కార్పోరేషన్ డైరెక్టర్ చావలి శివ, సర్పంచ్ నాగమల్లారెడ్డి, తహశీల్దార్ ఉదయ భాస్కర్ రాజు, ఎంపీడీవో అల్తాఫ్ హుస్సేన్, సర్పంచ్‌లు ఎంపీటీసీలు, పింఛన్ లబ్ధిదారులు పాల్గొన్నారు.

నవరత్నాల పథకాలతో అందరికీ మేలు



కమలాపురం : వైఎస్ఆర్ సీపీ కార్యాలయంలో కేక్ కట్ చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు



చెన్నూరు : వైఎస్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

కమలాపురం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి నవరత్నాల పథకాలతో అందరికీ మేలు చేస్తున్నారని మార్కెట్ యార్డు కమిటీ ఛైర్మన్ ఎస్‌సీ పుల్లారెడ్డి తెలిపారు. వైఎస్ జగన్ ప్రతిపక్ష నేతగా ఉన్నప్పుడు చేపట్టిన ప్రజా సంకల్ప యాత్ర ద్వారా ప్రజల సమస్యలు తెలుసుకున్నారని.. నేడు పేదలందరికీ లబ్ధి చేకూరేలా అనేక పథకాలు అమలు చేస్తున్నారన్నారు. ప్రజా సంకల్ప పాదయాత్రకు నాలుగేళ్లు పూర్తి అయిన నేపథ్యంలో సోమవారం స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయం ఎదుట ఉన్న మహానేత వైఎస్ఆర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం పార్టీ కార్యాలయంలో కేక్ కట్ చేసి అభిమానులు, పార్టీ కార్యకర్తలు, నాయకులకు పంచిపెట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని వర్గాల ప్రజల కష్టాలు తీర్చిన గొప్ప మనసున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి అన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ ఛైర్మన్ మారుజోళ్ల శ్రీనివాసరెడ్డి, సుధా కొండారెడ్డి, జగన్ మోహన్ రెడ్డి, ఇందిరెడ్డి శ్రీనివాసుల రెడ్డి, మస్తానయ్య, పుత్తా మధు, పి.సుబ్బారెడ్డి, నిఖిల్‌రెడ్డి, హీరామియ్య, దేవదానం, జెట్టి నగేష్, సుదీర్, శంకర్‌రెడ్డి, షావలి, రవి శంకర్ పాల్గొన్నారు.

చెన్నూరు : ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రాభివృద్ధి, ప్రజల సంక్షేమమే లక్ష్యంగా పాలన కొనసాగిస్తున్నారని మండల వైఎస్సార్ సీపీ కన్వీనర్ జీఎన్ భాస్కర్‌రెడ్డి, ఎంపీపీ చీర్ల సురేష్‌యాదవ్‌లు తెలిపారు. వైఎస్ జగన్ ప్రతిపక్ష నేతగా నాడు చేపట్టిన ప్రజా సంకల్ప పాదయాత్ర పూర్తయిన రోజును పురస్కరించుకని సోమవారం వారు పార్టీ నాయకులు, అభిమానులతో మండల ప్రజాపరిషత్ కార్యాలయ ఆవరణలో కేక్ కట్ చేసి పంచిపెట్టారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు పెడబల్లె జయభారత్‌రెడ్డి, మార్కెట్‌యార్డు డైరెక్టర్ కరీం, నియోజకవర్గ మైనార్టీ నాయకలు అన్వర్ బాష, ఆకుల ప్రసాద్‌బాబు, వారిస్, నీలం వెంకట సుబ్బారెడ్డి, డాక్టర్ పిచ్చయ్య పాల్గొన్నారు.

ఓవరాల్ చాంపియన్స్‌గా లయోలా పాలిటెక్నిక్ కళాశాల

పులివెందుల టౌన్ : ప్రొద్దుటూరు ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో జరిగిన 25వ ఇంటర్ పాలిటెక్నిక్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్‌లో లయోలా పాల్‌టెక్నిక్ కళాశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచి టోర్నమెంట్ ఓవరాల్ ఛాంపియన్స్‌గా నిలిచారని కళాశాల కరస్పాండెంట్ ఫాదర్ ఆంటోని స్వామి పేర్కొన్నారు. సోమవారం స్థానిక లయోలా పాలిటెక్నిక్ కళాశాలలో ఆయన మాట్లాడుతూ క్రీడలలో రిలేలో ప్రథమ , షార్ట్‌పుట్‌లో ప్రథమ, తృతీయ స్థానాలు, హైజంప్‌లో ప్రథమ, ద్వితీయ , ట్రిపుల్ జంప్‌లో ప్రథమ, ద్వితీయ స్థానాలు, లాంగ్ జంప్‌లో ప్రథమ, తృతీయ స్థానాలు, పరుగు పందెంలో ద్వితీయ, తృతీయ , డిస్కస్ త్రోలో నాల్గవ స్థానంలో నిలిచారన్నారు. గేమ్స్‌లో కబడ్డీ, వాలీబాల్, బాల్ బ్యాడ్మింటన్, టేబుల్ టెన్నిస్ సింగిల్స్ అండ్ డబుల్స్‌లో విన్నర్స్‌గా నిలవగా.. చెస్‌లో రన్నర్స్‌గా ప్రతిభ చూపారన్నారు. ఇలా అన్ని విభాగా లలో రాణించి ఓవరాల్ ఛాంపియన్స్‌గా నిలిచారన్నారు. అనంతరం కడపలో జరిగిన పాలిటెక్నిక్ బాలికల టోర్నమెంట్‌లో ఖో ఖోలో రన్నర్స్, 400, 200 మీటర్ల పరుగు పందెంలో తృతీయ స్థానం, డిస్కస్ త్రోలో బహుమతి సాధించారన్నారు. అనంతరం ప్రతిభ చూపిన విద్యార్థులను ప్రత్యేకంగా అభినందించారు. కళాశాల ప్రిన్సిపల్ ఫాదర్ బ్రిట్టో, వైస్ ప్రిన్సిపల్ ఫాదర్ విజయరాజు పాల్గొన్నారు.

రాష్ట్రంలో సువర్ణపాలన

– ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి



ప్రభుత్వ పథకాలు వివరిస్తున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

జమ్మలమడుగు: అర్హులైన ప్రతినిరుపేదకు నవరత్నాలతో కూడిన సంక్షేమ ఫలాలు అందించడమే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యమని శాసనసభ్యుడు డాక్టర్ మూలె సుధీర్‌రెడ్డి పేర్కొన్నారు. సోమవారం మున్సిపల్ చైర్‌పర్సన్ వేల్పుల శివమ్మతో కలిసి 13వ వార్డులో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా ఇంటింటికి వెళ్లి ప్రజలకు అందుతున్న సంక్షేమ పథకాల గురించి అడిగితెలుసుకున్నారు. రాకపోతే ఎందుకు రావడంలేదంటూ సచివాలయ ఉద్యోగులను ప్రశ్నించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ చేనేత కార్మికులకు ఇప్పటికి నాలుగు విడతలలో 96 వేల రూపాయలు జమ చేసిన ఘనత ఒక్క వైఎస్సార్‌సీపీ అధినేత ,ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి మాత్రమే దక్కుతుందన్నారు. విద్యార్థులకు ట్యాబ్‌లు ఇచ్చి తద్వారా మెరుగైన విద్య అందించి వారిని భవిష్యత్తులో ఉన్నత స్థాయిలో చూడాలని ముఖ్యమంత్రి ఆకాంక్షించడం గొప్ప విషయమన్నారు. రాష్ట్రం వ్యవసాయంతోపాటు, వైద్య విద్య, సంక్షేమం వైపు పరుగులు తీస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్ మునిసుబ్బారెడ్డి, మున్సిపల్ వైస్ ఛైర్మన్ సింగరయ్య, ఇండస్ట్రియల్ డెవలప్‌మెంట్ డైరెక్టర్ మార్బల్ శ్రీను, వైఎస్సార్‌సీపీ యూత్ మండల కన్వీనర్ ఆకుల బాబా, జనార్దన్, సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

ఎర్రగుంట్ల : సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాల వల్ల ప్రతి ఇంటికి లబ్ధి చేకూరుతోందని జమ్మలమడుగు ఎమ్మెల్యే డాక్టరు ఎం సుధీర్‌రెడ్డి అన్నారు. సోమవారం ఉదయం నిడుజివ్వి గ్రామంలో జమ్మలమడుగు నియోజకవర్గ పార్టీ నాయకులు ఎమ్మెల్యేను కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంక్షేమ పథకాలు అర్హత ఉన్న ప్రతి ఒక్కరికి అందుతున్నాయని అన్నారు. వలంటీర్ వ్యవస్థను, సచివాలయ వ్యవస్థలను ఏర్పాటు చేసి ఇంటి ముంగిటికే పథకాలు అందించే ఏర్పాటు చేశారన్నారు.

పాఠశాలల అభివృద్ధికి ప్రణాళికలు సిద్ధం చేయాలి

వీరపునాయునిపల్లె: మండలంలోని పాఠశాలల అభివృద్ధికి ప్రధానోపాధ్యాయులు ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని మండల విద్యాశాఖాధికారి జాఫర్ సాదిక్ పేర్కొన్నారు. సోమవారం మండల కేంద్రంలోని సంగమేశ్వర ఉన్నత పాఠశాల(ఎయిడెడ్)లో ప్రభుత్వం, యాజమాన్య పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు పాఠశాల అభివృద్ధి, ఆవాస ప్రాంత ప్రణాళిక, యు డైస్‌పై ఒక్క రోజు శిక్షణా కార్యక్రమం జరిగింది. మండల విద్యాశాఖాధికారి జాఫర్ సాధిక్ మాట్లాడారు.

పెద్దముడియం: మండలంలోని ప్రాథమిక, ప్రాథమికోన్నత, జిల్లా పరిషత్ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు పాఠశాలల అభివృద్ధికి సహకరించాలని మండల విద్యాశాఖాధికారి శివప్రసాద్ తెలిపారు. సోమవారం మండలంలోని పెద్దపసుపుల గ్రామంలోని జిల్లా పరిషత్ కార్యాలయంలో ప్రధానోపాధ్యాయులతో ఆయన సమావేశం ఏర్పాటు చేసి పలు సూచనలు, సలహాలు ఇచ్చారు.

పౌష్టికాహారం పంపిణీ

పులివెందుల రూరల్ : పట్టణంలోని ప్రభుత్వాసుపత్రిలో సోమవారం ప్రధానమంత్రి మాతృత్వ సురక్ష అభియాన్ కార్యక్రమంలో భాగంగా మానవత స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో శ్రీవెంకటేశ్వర బేకరీ యజమాని కేశవరెడ్డి సహకారంతో అందించిన పండ్లు, బ్రెడ్లను పీహెచ్‌సీ డాక్టర్ లక్ష్మీప్రియ, మానవత సంస్థ చైర్మన్ కొండారెడ్డిల చేతులమీదుగా గర్భిణీలకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మానవత సంస్థ సభ్యులు హరిశ్చంద్రారెడ్డి, నారాయణరెడ్డి, చంద్రశేఖరరెడ్డి, ఆసుపత్రి సిబ్బంది, సేవా సమితి అధ్యక్షుడు రాజు, సేవా సమితి సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

సంఘాల బలోపేతానికి కృషి

పులివెందుల రూరల్ : పులివెందుల మున్సిపాలిటీ పరిధిలో పొదుపు సంఘాల బలోపేతానికి కృషి చేస్తానని టౌన్ మిషన్ కో.ఆర్డినేటర్ గంగులయ్య పేర్కొన్నారు. సోమవారం పులివెందులలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఇక్కడ పనిచేస్తున్న అబ్బాస్ రాయచోటికి బదిలీ కావడంతో ఆయన స్థానంలో టౌన్ మిషన్ కో.ఆర్డినేటర్‌గా పులివెందులకు రావడం జరిగిందన్నారు. మహిళలు సాంకేతిక, ఆర్థిక, సామాజిక రంగాలలో అభివృద్ధి చెందాలన్నారు. ప్రతి సంఘంలోని సభ్యులు పంచ సూత్రాలు పాటించాలన్నారు.

కోడి పందెం స్థావరాలపై దాడులు

వేంపల్లె : మండలంలోని అలిరెడ్డిపల్లె పంచాయతీ పరిధిలో ఉన్న కోడిపందెం స్థావరాలపై పోలీసులు దాడులు నిర్వహించారు. ఎస్ఐ తిరుపాల్‌నాయక్ తెలిపిన మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. సీఐ వెంకటేశ్వర్లు ఆదేశాల మేరకు ఎస్ఐలు రఘురామ్, తిరుపాల్‌నాయక్ పోలీసు సిబ్బందితో కలిసి సోమవారం కోడిపందెం స్థావరాలపై దాడులు నిర్వహించారు. కోడిపందెం ఆడుతున్న 15 మందిని అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి రెండు కోళ్లతోపాటు రూ.20,500 నగదు స్వాధీనం చేసుకున్నారు.

పురపాలక ఆదాయాన్ని పెంచేందుకు కృషి



మాట్లాడుతున్న మున్సిపల్ ఇన్‌చార్జి వైఎస్ మనోహర్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్

పులివెందుల టౌన్ : మున్సిపాలిటీ పరిధిలో ప్రతి ఒక్కరూ కష్టపడి మున్సిపల్ ఆదాయాన్ని పెంచే విధంగా పనిచేయాలని మున్సిపల్ ఇన్‌చార్జి వైఎస్ మనోహర్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్ పేర్కొన్నారు. సోమవారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలోని కౌన్సిల్ హాలులో మున్సిపల్ కమిషనర్ నరసింహారెడ్డి అధ్యక్షతన 2023–24 సంవత్సరానికి సంబంధించి బడ్జెట్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ ఆదాయ వనరులపై వారు చర్చించారు.
మున్సిపాలిటీకి వచ్చే ఆదాయంతో పోలిస్తే ఖర్చు ఎక్కువగా ఉందన్నారు. వచ్చే ఆదాయం కరెంటు బిల్లులకు, జీతభత్యాలకు సరిపోతోందన్నారు. మిగతా వాటికి సంబంధించి ఆదాయం పెంచుకునేందుకు ప్రణాళిక సిద్ధం చేసి ఆదాయ మార్గాలను పెంచాలన్నారు. కరెంటు బిల్లు తగ్గించేందుకు సోలార్ సిస్టంను ఏర్పాటు చేస్తామన్నారు. పట్టణంలో ప్లాస్టిక్ వాడకం ఎక్కువైందని.. ప్లాస్టిక్ వాడే వారిపై జరిమానా విధించి ప్లాస్టిక్ నిషేధించాలన్నారు. ఖాళీ స్థలాలకు పన్నులు విధించాలన్నారు. ఇలా చేయడంవల్ల మున్సిపాలిటీకి ఆదాయం పెరుగుతుందన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ హఫీజ్, కౌన్సిలర్లు, మున్సిపల్ అధికారులు, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

వాల్మీకి విగ్రహం ఏర్పాటుకు సహకరించాలి

పులివెందుల పట్టణంలో వాల్మీకి విగ్రహం ఏర్పాటుకు సహకరించాలని ఆ సంఘ నియోజకవర్గ అధ్యక్షుడు అంబకపల్లె బాలుడు కోరారు. సోమవారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో ఉన్న మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్‌ను కలసి ఆయన వినతి పత్రం అందజేశారు.

పండ్లు పంపిణీ

ఎర్రగుంట్ల : మానవత స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ఎర్రగుంట్ల ప్రభుత్వ ఆసుపత్రిలో ఉన్న గర్భిణీలకు బ్రెడ్, పండ్లు, బిస్కెట్లను సోమవారం పంపిణీ చేసినట్లు మానవత సేవా సంస్థ చైర్మన్ రఘురామిరెడ్డి, అధ్యక్షులు కె గంగాధర్‌రెడ్డిలు తెలిపారు. కార్యక్రమంలో మానవత సెక్రటరీ షర్ఫుద్దీన్, కోశాధికారి జీరెడ్డి మల్లిఖార్జునరెడ్డి, రాజవర్ధన్‌రెడ్డి, ఎస్ మధుసూదన్ రెడ్డి, సాంబశివారెడ్డి పాల్గొన్నారు.

అంధుల ఆరాధ్య దైవం లూయీ బ్రెయిలీ

చింతకొమ్మదిన్నె : అంధుల ఆరాధ్య దైవం లూయి బ్రెయిలీ అని మండల విద్యాశాఖాధికారి వెంకట్రామిరెడ్డి తెలిపారు. సోమవారం భవిత స్కూలులో లూయీ బ్రెయిలీ జయంతిని పురస్కరించుకుని నిర్వహించిన కార్యక్రమంలో ఎంఈఓ మాట్లాడారు. ఉపాధ్యాయుడు సురేంద్ర, షాకీర, వసుధ, ప్రధానోపాధ్యాయులు వెంకటేశ్వర్లు, తల్లిదండ్రులు పాల్గొన్నారు. అనంతరం పిల్లలకు ప్రత్యేక సౌకర్యాలుగల కుర్చీలను అందజేశారు.

బాలుడి అదృశ్యం

ఎర్రగుంట్ల : ఎర్రగుంట్ల నగర పంచాయతీ పరిధిలోని క్రిష్టియన్‌లైన్‌లో నివాసం ఉండే చక్రకోళ్ల ప్రశాంత్ చరణ్‌కుమార్ అనే బాలుడు అదృశ్యం అయినట్లు తండ్రి సంపత్ కుమార్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. సీఐ మంజునాథ్‌రెడ్డి సోమవారం తెలిపిన మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. మందలించడంతో ఇంటి నుంచి వెళ్లి పోయినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు. ఆచూకీ తెలిసిన వారు ఎర్రగుంట్ల సీఐ 9121100530, ఎస్ఐ 6305559746 సెల్ నంబర్లకు సమాచారం ఇవ్వాలని ఎస్ఐ తెలిపారు.

భూమి పూజ

ముద్దనూరు: మండలంలోని ఓబుళాపురం గ్రామానికి రూ.3 కోట్ల 57లక్షల వ్యయంతో నిర్మించే రహదారికి సోమవారం భూమిపూజ చేశారు. ముద్దనూరు–తాడిపత్రి ప్రధాన రహదారి నుంచి ఓబుళాపురం గ్రామానికి నిర్మించే రహదారికి మాజీ ఎంపీపీ మునిరాజారెడ్డి, సర్పంచ్ భాస్కర్‌రెడ్డిలు భూమి పూజ చేశారు. త్వరలో రోడ్డు నిర్మాణాన్ని పూర్తిచేస్తామని నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల కన్వీనర్ శ్రీధర్‌రెడ్డి, నాయకులు లక్ష్మీనారాయణ రెడ్డి, నవకాంత్ రెడ్డి, శ్రీకాంత్ రెడ్డి, భాస్కర్ రెడ్డి, సోమేశ్వర రెడ్డి పాల్గొన్నారు.

సంక్రాంతి పండుగలోగా తొలగించుకోవాలి

వేంపల్లె : వేంపల్లె పట్టణంలో కడప – పులివెందుల రోడ్డు, గండి రోడ్డు విస్తరణ పనులు ముమ్మరంగా జరుగుతున్న విషయం అందరికి తెలిసిందే. కాగా రోడ్డు విస్తరణ లో భాగంగా కొంతమంది బాధితులకు నష్టపరిహారం ఇవ్వకపోవడంతో రోడ్డు, భవనాల శాఖ వారు ఇచ్చిన మార్కింగ్ వరకు తొలగించకుండా ఆపివేశారు. గత డిసెంబర్ నెలలో వేంపల్లె జెడ్పీటీసీ రవికుమార్‌రెడ్డి, కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డిలు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లగా.. పెండింగ్‌లో ఉన్న రూ.26కోట్ల నిధులు మంజూరు చేయించారు. దీంతో ఇళ్లు, వాణిజ్య సదుపాయాలు కోల్పోయిన వారందరూ సంక్రాంతి పండుగలోగా రహదారులు, భవనాల శాఖ వారు ఇచ్చిన మార్కింగ్ వరకు త్వరగా తొలగించుకోవాలని జెడ్పీటీసీ రవికుమార్‌రెడ్డి కోరారు. త్వరలో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, వాటర్ గ్రిడ్‌కు సంబంధించి పనులు రోడ్డుకు ఇరువైపులా మొదలు పెట్టాలి.. కనుక ప్రజలందరూ సహకరించాలన్నారు. ఎవరైనా బాధితులు సంక్రాంతిలోపు తొలగించకుంటే ఆర్అండ్‌బీ అధికారులు సంక్రాంతి పండుగ తర్వాత తొలగిస్తారని తెలిపారు.

చర్చి నిర్మాణానికి పునాది



చర్చి పునాదిని ప్రారంభిస్తున్న వర ప్రసాద్, సంఘ పెద్దలు

కొండాపురం: మండల కేంద్రంలోని నూతన బైపాస్ సమీపంలో ఎస్సీ కాలనీ సమీపంలో సీఎస్ఐ చర్చి నిర్మించేందుకు శ్రీకారం చుట్టారు. సోమవారం రాయలసీమ పీఠాధిపతులు పి. ఐజాక్ వరప్రసాద్, సి.డి. భారతిలు పునాదిని ప్రారంభించారు. ఈ సందర్భంగా బిషప్ మాట్లా డుతూ సంఘ పెద్దలు ఐక్యతతో సీఎస్ఐ చర్చి నిర్మించేందుకు కృషి చేయాలన్నారు. ఈ సందర్భంగా సంఘ పెద్దలు వారిని ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో డివిజనల్ చైర్మన్ ప్రభాకర్, సిఎస్ఐ సంఘ పెద్దలు జోసఫ్, మనోహర్‌బాబు, విజయరాజు, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

క్రీడలు ఆత్మ విశ్వాసాన్ని పెంపొందిస్తాయి

కమలాపురం: క్రీడలు మానసిక ప్రశాంతతను, శారీరక దృఢత్వాన్ని కలిగించడంతో పాటు ఆరోగ్యం, ఆత్మ విశ్వాసం పెంపొందిస్తాయని సీఎస్ఎస్ఆర్ అండ్ ఎస్ఆర్ఆర్ఎం డిగ్రీ, పీజీ కళాశాల కరస్పాండెంట్ రాజగోపాల్ రెడ్డి తెలిపారు. సోమవారం జాతీయ యువజన దినోత్సవాన్ని పురస్కరించుకుని స్థానిక ఆ కళాశాలలో భారత ప్రభుత్వం, యువజన వ్యవహారాలు, క్రీడా మంత్రిత్వ శాఖ, మదర్ థెరిసా సేవా సమితి ఛారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో వాలీబాల్ పోటీలు నిర్వహించారు. క్రీడాకారులను పరిచయం చేసుకుని వాలీబాల్ పోటీలను కరస్పాండెంట్ ప్రారంభించారు. నెహ్రూ యువ కేంద్రం జిల్లా అధికారి మణికంఠ మాట్లాడారు. పోటీల్లో పాల్గొన్న కమలాపురం కింగ్స్ టీం ప్రథమ స్థానంలో, డిగ్రీ కళాశాల టీం ద్వితీయ స్థానంలో నిలిచారు. విజేతలకు వరుసగా రూ.3వేలు, రూ.2వేలు నగదు బహుమతితో పాటు ట్రోఫీ, సర్టిఫికెట్లను నిర్వాహకులు అందజేశారు. ఈ కార్యక్రమంలో మదర్ థెరిసా సేవా సమితి చారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షుడు జూటూరు విజయ్, పీఈటీ నరహరి, క్రీడాకారులు పాల్గొన్నారు.

ఘనంగా పెద్దమ్మ తల్లి జాతర

జమ్మలమడుగు రూరల్: జమ్మలమడుగు మండల పరిధిలోని గండికోట కొట్టాలపల్లె గ్రామంలో సోమవారం పెద్దమ్మ తల్లి జాతరను కమిటీ నిర్వాహకులు, గ్రామస్తులు ఘనంగా నిర్వహించారు. వేకువజాము నుంచి భక్తులు అమ్మవారికి బోనాలు సమర్పించారు. జాతరను పురస్కరించుకుని ఎమ్మెల్యే డాక్టర్ మూలే సుధీర్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకుడు మాజీమంత్రి పి. రామసుబ్బారెడ్డి, సోదరుడు గిరిధర్‌రెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించారు.